సాక్షి
శ్రీకాకుళం

శనివారం । 28 । అక్టోబర్ । 2023



రైతన్న నేస్తాలకు..

రైతన్న నేస్తాలకు ప్రభుత్వం ఆపన్న హస్తం అందిస్తోంది. ల్యాబ్‌లతో వైద్య సేవలు అందిస్తోంది. - 8లో



స్త్రీనిధి.. అతివకు పెన్నిధి

జిల్లా మహిళలు స్త్రీ నిధి రుణాలు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈ బ్యాంకు ఏర్పాటై 12 ఏళ్లవుతోంది. - 8లో

నవోదయలో ప్రవేశానికి 31లోగా దరఖాస్తు చేయాలి

నరుబుజ్జిలి: వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో 2024- 25 విద్యాసంవత్సరానికి 9, 11 వ తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయం ప్రిన్సిపాల్ డి.వరశురామయ్య శుక్రవారం ప్రకటనలో వెల్లడించారు. దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే చేయాలని సూచించారు.

న్యూస్‌రీల్

నేడే చంద్రగ్రహణం

అరసవల్లి: రాహుగ్రస్త పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా శనివారం రాత్రి 7 గంటల నుంచి అరసవల్లి ఆలయ ప్రధాన తలుపులు మూసివేస్తున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ వి.హరి సూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకర శర్మలు తెలియజేశారు. గ్రహణ శుద్ధి, సంప్రోక్షణ తదితర కార్యక్రమాల అనంతరం తిరిగి ఆదివారం ఉదయం 7 గంటలకు ఆలయ ప్రధాన తలుపులు తెరవనున్నట్లుగా వారు ప్రకటించారు. గ్రహణ కాలం పూర్తిగా పాక్షికం.. అందునా అర్ధరాత్రి కావడంతో పెద్దగా ప్రభావాలుండవని, అయితే ఆలయంలో ఎలాంటి కార్యక్రమాలు జరుపకుండా శాస్త్ర ప్రకారం శుద్ధి కార్యక్రమాలను నిర్వహించనున్నామని ప్రకటించారు. ఆదివారం ఆదిత్యుని దర్శనాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో తగిన ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు ప్రకటించారు.

నేడు శ్రీముఖలింగం ఆలయం మూసివేత

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం ఆలయం చంద్రగ్రహణం కారణంగా శనివారం సాయంత్రం ఆరుగంటలకు మూసివేయనున్నట్లు ఆలయ ఈఓ ప్రభాకరరావు శుక్రవారం తెలిపారు. ఆదివారం ఉదయం తెరచి సంప్రోక్షణ, శుద్ధి పూజలు అనంతరం భక్తుల దర్శనానికి అవకాశం ఉంటుందన్నారు.

కొవ్వాడ ప్రాజెక్టు ప్రత్యేక ఉప కలెక్టర్‌గా పద్మావతి



కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను కలిసిన కొవ్వాడ ఎస్‌డీసీ పద్మావతి

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (కొవ్వాడ ప్రాజెక్ట్) ప్రత్యేక ఉప కలెక్టర్‌గా బి.పద్మావతి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఎస్‌డీసీగా ఉన్న పి.మురళీకృష్ణ ఆమెకు బాధ్యతలు అప్పగించారు. అనంతరం ఆమె కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను గౌరవ పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, టాలీల్లో ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఉమ్మడి జిల్లా యువకులకు ఎలక్ట్రికల్ వైరింగ్, కంప్యూటర్ అకౌంటింగ్ (టాలీ)లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు చెప్పారు. నవంబర్ 3వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ సంస్థలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. 30 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ సమయంలో ఉచితంగా భోజన, వసతులు కల్పించనున్నట్లు వివరించారు. 19 నుంచి 45 ఏళ్ల వయస్సు పురుషులు అర్హులు కాగా, 10వ తరగతి విద్యార్హతగా చెప్పారు. పూర్తివివరాలకు ఫోన్ నంబర్లు 7993340407, 9553410809ను సంప్రదించాలని తెలిపారు.

భూముల రీసర్వే పూర్తి చేయాలి



సర్వే రికార్డులు పరిశీలిస్తున్న నూరుల్ కమార్

ఎల్.ఎన్.పేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూమి రీసర్వే ప్రక్రియను వచ్చే నెల పదో తేదీలోగా పూర్తి చేయాలని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమార్ అన్నారు. స్థానిక కార్యాలయానికి వచ్చిన ఆయన సమగ్ర భూమి రీసర్వే తీరును తహసీల్దారు ఆర్.అప్పలరాజును అడిగి తెలుసుకున్నారు. మండలంలో 47 రెవెన్యూ గ్రామాల్లో సర్వే చేపట్టామన్నారు. 33 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తయిందన్నారు. మిగిలిన రెవెన్యూ గ్రామాల్లో వచ్చే నెల పదో తేదీనాటికి సర్వే పూర్తి చేయాలన్నారు. సర్వే వివరాలు, స్టోన్ ప్లాంటేషన్, పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాలా వసూలు చేయాలన్నారు. సర్వేయర్ రెడ్డి గవరయ్య ఉన్నారు.

తలనీలాల హక్కుకు వేలం

టెక్కలి: టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జునస్వామి దేవస్థానంలో మొక్కుల ద్వారా సమర్పించే తలనీలాల హక్కు కోసం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి కార్యనిర్వాహణాధికారి జి.ప్రసాద్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏడాది కాల పరిమితికి తల నీలాల హక్కు కోసం ఈ నెల 31న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం వేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రూ.25 వేల ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని ప్రకటించారు.

ఊరికి ప్రగతి కబురు



ఊరికి ప్రగతి కబురు అందుతోంది. పరిష్కారం కాకుండా ఉండిపోయిన సమస్యలకు ఓ మార్గం కనిపిస్తోంది. పొలిమేరలోని దారుల నుంచి ఊరిలోని కాలువల వరకు అన్ని నిర్మాణాలకు దండిగా నిధులు వస్తున్నాయి. ఇక విధులు నిర్వహించడమే తరువాయి. ఇప్పటికే ఆర్‌బీకేలు, నాడు-నేడు బడులు, కొత్త సచివాలయాలతో కళకళలాడుతున్న గ్రామాల్లో పాత సమస్యలు కూడా తీరిపోతే ప్రగతి 'పల్లె'వించినట్టే.

- తీరనున్న ఊరి సమస్యలు
- గడప గడపకూ కార్యక్రమంలో రూ. 88.30 కోట్ల పనులు మంజూరు
- తాజాగా రూ. 21కోట్లతో మెటీరియల్ కాంపోనెట్ పనులు
- సీసీ రోడ్లు, డ్రైనేజీ తదితర పనులకు వెసులుబాటు
- అందుబాటులో నిధులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : పల్లెల అభివృద్ధికి నలువైపుల నుంచి నిధులు వస్తున్నాయి. ఒకవైపు గడప గడపకూ మన ప్రభుత్వం పనులు, మరోవైపు ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెట్ పనులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు జోరందుకోనున్నాయి. ఇప్పటికే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం కింద రూ. 88.30కోట్లతో 2691 పనులు మంజూరు చేయగా, తాజాగా ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెట్ కింద రూ. 21కోట్లు కేటాయింపునకు సిద్ధంగా ఉన్నాయి. క్షేత్రస్థాయి నుంచి ప్రతిపాదనలు రాగానే పనులతో పాటు నిధులు మంజూరు చేసేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉంది. కాంట్రాక్టర్లు చొరవ చూపించి పనులు పూర్తి చేయడమే మిగిలి ఉంది.

మండలానికి రూ. 60లక్షలు

ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెట్ కింద మండలానికి రూ. 60లక్షలు చొప్పున ఇప్పటికే కేటాయించేందుకు నిధులు సిద్ధంగా ఉన్నాయి. సీసీ రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఈ నిధులు వినియోగించుకోవచ్చు. కలెక్టర్ ఇప్పటికే ప్రతిపాదనలు కోరారు. క్షేత్రస్థాయి నుంచి ప్రతిపాదనలు రాగానే పనులతో పాటు నిధులు మంజూరు చేయనున్నారు. ఒక్కో మండలానికి రూ. 60లక్షలు చొప్పున జిల్లాలో ఐటీడీఏ పరిధిలోకి రాని 25 మండలాలకు మంజూరు కానున్నాయి.

ఐటీడీఏ మండలాలకు రూ. కోటి 20లక్షలు

ఐటీడీఏ పరిధిలోని గిరిజన ప్రాంత మండలాలకు రెట్టింపు నిధులు మంజూరు కానున్నాయి. మందస, మెళియాపుట్టి, కొత్తూరు, పాతపట్నం, హిరమండలం మండలాలకు చెరో రూ. కోటి 20లక్షలు చొప్పున నిధులు మంజూరు చేస్తారు. గిరిజన ప్రాంతాల ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం అదనపు నిధులు కేటాయిస్తుంది. ఐదు ఐటీడీఏ మండలాలకు గాను రూ. 6కోట్లు వరకు ఖర్చు చేస్తారు.

అందుబాటులో నిధులు



అటు గడప గడపకూ మన ప్రభుత్వం పనులకు, ఇటు ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెట్ పనులకు నిధులు అందుబాటులో ఉన్నాయి. పనులు ప్రారంభించి, పూర్తి చేస్తే చాలు నిధులు విడుదలవుతాయి. చేసిన పనుల మేరకు బిల్లులు అప్‌లోడ్ చేస్తే తదనుగుణంగా సంబంధిత పనులు చేసిన వారి ఖాతాలో సొమ్ము జమ కానుంది. అయితే గడప గడపకూ మన ప్రభుత్వం కింద చేపట్టిన పనులు మిగతా జిల్లాలతో పోలిస్తే మన జిల్లాలో వేగంగా జరగడం లేదు. ఈ కార్యక్రమంలో ఇప్పటి వరకు రూ. 88.30కోట్లతో 2691పనులు మంజూరు చేయగా ఇప్పటివరకు 1644 పనులు మాత్రమే ప్రారంభమయ్యాయి. వీటిలో 376 పూర్తయ్యాయి. నిధుల వినియోగంలోకి వస్తే రూ.13.20కోట్లు ఖర్చు చేశారు. పంచాయతీరాజ్, గ్రామీణ రక్షిత మంచినీటి సరఫరా, ఏపీఈపీడీసీఎల్ తదితర శాఖల పర్యవేక్షణలో జరుగుతున్న పనులు మరింత ఊపందుకోవల్సిన అవసరం ఉంది. నిధులకు ఢోకా లేదు.. పనులు చేయండి అని అధికారులు వెంట పడుతున్నారు.

చొరవ చూపాలి

జిల్లాలో అభివృద్ధి పనులకు నిధులు సిద్ధంగా ఉన్నాయి. అటు గడప గడపకూ మన ప్రభుత్వం కింద చేపడుతున్న పనులకు, త్వరలో మంజూరు చేయనున్న ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెట్ పనులకు చకచకా నిధులు విడుదల చేయనున్నాం. కాంట్రాక్టర్లు మరింత చొరవ చూపాలి. చేసిన పనుల మేరకు బిల్లులు అప్‌లోడ్ చేస్తే వెంటనే నిధులు విడుదల చేస్తాం. బిల్లుల కోసం ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎప్పటికప్పుడు అవసరమైన నిధులు విడుదల చేస్తాం. - శ్రీకేష్ బి.లాఠకర్, కలెక్టర్

శశివదనం..



ముఖలింగేశ్వరుడి ఆలయ శిఖరానికి నిండు చంద్రుడు ఆభరణంగా చేరాడు. పవిత్ర గౌరీ పౌర్ణమి ముందురోజున ఇలాంటి ఆధ్యాత్మిక దృశ్యం ఆవిష్కృతం కావడంతో స్థానికులు ఆసక్తిగా గమనించారు. - జలుమూరు

రిమ్స్‌లో మరమ్మతులకు నిధులు విడుదల

- ప్రతిపాదనలు పంపిన 15 రోజులకు రూ.4.6 కోట్లు విడుదల
- త్వరలోనే పనులు ప్రారంభం



శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలోని రిమ్స్ వైద్య కళాశాల, దానికి అనుబంధంగా ఉన్న ఆస్పత్రిలో పాత భవనాల మరమ్మతులకు ప్రభుత్వం రూ.4.6 కోట్ల నిధులు మంజూరు చేసింది. గతంలో జిల్లా అస్పత్రిగా ఉన్నప్పటి భవనాలను కొత్త భవనాలకు అనుసంధానం చేసి వినియోగిస్తుండగా ఆయా భవనాల్లో శ్లాబులు పెచ్చులూడటం, గోడలు బీటలు వాలటం, గచ్చులు పాడవ్వటం వంటి ఇబ్బందులు ఉండటంతో అనేక గదులు వినియోగించకుండా వదిలేశారు. పాత వార్డుల్లోని అనేకచోట్ల పైపులైన్ దెబ్బతినడం, మరుగుదొడ్లు వినియోగానికి పనికిరాకుండా ఉన్నాయి. తలుపులు, కిటికీలు పూర్తిగా పాడయ్యాయి. ఏపీహెచ్ ఎంహెచ్ ఐడీసీ అధికారులు ఆయా భవనాలను సరికొత్తగా తయారు చేసేందుకు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించగా ప్రతిపాదనలు అందిన 15 రోజుల్లో ప్రభుత్వం రూ.4.6కోట్లు నిధులు మంజూరు చేసింది.

టెండర్ల ప్రక్రియ పూర్తి

ఏపీహెచ్‌ఎంహెచ్ ఐడీసీ అధికారులు పనులు చేపట్టేందుకు ఆన్‌లైన్ ద్వారా టెండర్లను నిర్వహిస్తున్నారు. ఒక్కరికే పనులన్నీ అప్పగించకుండా ఎనిమిది భాగాలు చేసి టెండర్లను నిర్వహిస్తున్నారు. ఇప్పటికి ఒక పని చేపట్టేందుకు టెండర్లు దాఖలవ్వగా మిగిలిన ఏడు పనులకు రెండో విడతగా టెండర్లు పిలిచారు. ఖరారైన టెండర్లకు సంబంధించిన పనులు వారం రోజుల్లో ప్రారంభించాలని నిర్ణయించారు. రూ.4.6 కోట్లలో రూ.3.6 కోట్లను వైద్య కళాశాలలోని పాత భవనాల మరమ్మతులకు, రూ.కోటిని కళాశాల భవనాల్లోని మరమ్మతులకు కేటాయించనున్నారు.

పనులు ప్రారంభిస్తాం..

టెండర్లను పూర్తి చేసి త్వరలోనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అత్యవసర పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. అనుభవం కలిగిన కాంట్రాక్టర్ల ద్వారా టెండర్లను స్వీకరిస్తున్నాం. పనులు త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తాం. - సత్యప్రభాకర్, ఏపీహెచ్‌ఎంహెచ్ ఐడీసీ ఈఈ, శ్రీకాకుళం

ఆర్టీసీ డోర్ డెలివరీని ఆదరించండి



డోర్ డెలివరీ స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో విజయవంతంగా నడుస్తున్న డోర్ డెలివరీ విధానాన్ని ప్రజలు, వ్యాపారులు మరింతగా ఆదరించాలని జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళం-2 డిపో గ్యారేజీ ఆవరణలో జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయకుమార్ ఆధ్వర్యంలో డోర్ డెలివరీ స్టిక్కర్‌ను శుక్రవారం ఆవిష్కంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఎస్‌ఆర్టీసీ సంస్థ వారు 2021లో ఈ డోర్ డెలివరీ విధానాన్ని ప్రారంభించారని, అప్పటి నుంచి ఇప్పటివరకు కస్టమర్లందరూ ఏపీఎస్‌ఆర్టీసీ డోర్ డెలివరీని ఆదరిస్తున్నారన్నారు. దీనిలో భాగంగా అక్టోబర్ 26 నుంచి నవంబర్ 25 వరకు డోర్ డెలివరీ ప్రచార మహోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపిక చేసిన 90 పట్టణాల్లో 10 కిలోమీటర్ల పరిధిలో 50 కిలోల బరువు వరకు డోర్ డెలివరీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని కస్టమర్లు అందరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో విజయనగరం ఏటీఎం కమర్షియల్ దివ్య, శ్రీకాకుళం రెండో డిపో మేనేజర్ కెఆర్‌ఎస్ శర్మ, 1, 2 డిపోల అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, ఎస్‌ఎం నరేంద్ర, టీఐ-3 ఎల్‌ఎస్ నాయుడు, గ్యారేజ్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది అందరూ పాల్గొన్నారు.

ఖాతాదారుల సౌకర్యార్థం ఈ-స్టాంపింగ్



ఈ-స్టాంపింగ్ ప్రారంభిస్తున్న కరిమి రాజేశ్వరరావు

శ్రీకాకుళం అర్బన్: ఖాతాదారుల సౌకర్యార్థం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌లో ఈ-స్టాంపింగ్ ప్రారంభించినట్లు డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు తెలిపారు. శ్రీకాకుళంలోని డీసీసీబీ కార్యాలయంలో శుక్రవారం ఈ-స్టాంపింగ్‌ను డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-స్టాంపింగ్ ఇక నుంచి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌తో పాటు జిల్లాలోని 12 డీసీసీబీ బ్రాంచ్‌లలో అందుబాటులో ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డి.వరప్రసాద్, జీఎం ఎస్‌వీఎస్ జగదీష్, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.సత్యనారాయణ, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ జి.రామకృష్ణారావు, బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

3 నుంచి రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు



నాటిక పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కళాకారులు

శ్రీకాకుళం కల్చరల్: రంగస్థల కళాకారుల సమాఖ్య నెలవారీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో నవంబరు 3 నుంచి 5వ తేదీ వరకు మూడురోజుల పాటు రాష్ట్రస్థాయి నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సమాఖ్య అధ్యక్షుడు చిట్టి వేంకటరావు, గౌరవ అధ్యక్షుడు ఎల్.రామలింగస్వామి, కార్యనిర్వాహక అధ్యక్షుడు పన్నాల నర్సింహమూర్తిలు తెలిపారు. స్థానిక రంగస్థల కళాకారుల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం నాటిక పరిషత్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విలేకరులతో వారు మాట్లాడుతూ.. మూడురోజుల పాటు నిర్వహించే ఈ పరిషత్ నాటిక పోటీలకు ఎందరో దాతలు సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు.

3వ తేదీన సాయంత్రం 7గంటలకు విశాఖపట్నం జాస్మిన్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఈవెంట్స్ వారి 'మేము మనుషులమే నాటిక, 8.15 గంటలకు చిలకలూరిపేటకు చెందిన ది అమెచ్యూర్స్ డ్రమిటిక్ అసోసియేషన్ వారి 'ఏడనున్నాడో-ఎక్కడున్నాడో' నాటిక, 4న సాయంత్రం 7గంటలకు విశాఖకు చెందిన కళాభినయ, పార్వతీనగర్ వారి కన్నెర్ర నాటిక, 8.15 గంటలకు చిలకలూరిపేటకు చెందిన సుకృతి క్రియేషన్స్ వారి 'మిణుగురు వెలుగులు' నాటిక, 5వ తేదీన 6.15గంటలకు నెల్లూరుకు చెందిన క్రాంతి ఆర్ట్ థియేటర్స్ వారి 'ఓ మనిషి కావాలి' నాటిక, 7.30గంటలకు కట్రపాడుకు చెందిన ఉషోదయ కళానికేతన్ వారి 'విముక్తి' నాటిక ప్రదర్శనలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. సమావేశంలో సమాఖ్య కార్యదర్శి రామచంద్రదేవ్, పొట్నూరు వెంకటరావు, నిక్కు హరిసత్యనారాయణ, పైడి సత్యవతి, ఆశాలతాఖాన్, అడతమూడి సింహాచలం, మెట్ట పోలినాయుడు, జ్యోతిప్రసూన, ఇంజరాపు రమణారావు, కంచరాన అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్‌ఈ విధానంపై అవగాహన తరగతులు

శ్రీకాకుళం రూరల్: సీబీఎస్‌ఈ విధానం, సిలబస్‌పై మండల పరిధిలోని పెదపాడులో గల అంబేడ్కర్ బాలికల గురుకులంలో ఈ నెల 26, 27 తేదీల్లో అవగాహన సదస్సులు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ జ్యోతి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో గల 9 ప్రభుత్వ అంబేడ్కర్ గురుకుల పాఠశాల్లో 6 నుంచి 9 వ తరగతి వరకూ సిబిఎస్‌ఈ సిలబస్ జరుగుతోందని, దీనిపై విద్యార్థులకు ఎలా బోధించాలన్న విషయంపై వెన్నెలవలసకు చెందిన నవోదయ, పెదపాడుకు చెందిన కేంద్రీయ విద్యాలయం ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రాఘవేంద్రరావు, ఆర్‌కే యాదవ్‌లు వివరించినట్లు తెలిపారు. 2025 నాటికి అన్ని ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు సీబీఎస్‌ఈ సిలబస్ ద్వారానే పరీక్షలు జరుగుతాయని ఆమె వివరించారు.

దేశ రాజధానికి జిల్లా మట్టి



ఢిల్లీ వెళ్తున్న బృందం బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

అరసవల్లి: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా 'మేరా మట్టి..మేరా దేశ్' పేరిట జిల్లా నలుమూలల నుంచి సేకరించిన మట్టిని దేశ రాజధాని ఢిల్లీకి పంపిస్తున్నామని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. మట్టితో విజయవాడకు బయల్దేరిన నెహ్రూ యువ కేంద్ర అధికార సిబ్బందితో కూడిన కోఆర్డినేటర్ల బృందం బస్సును ఆయన శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో జిల్లాలో ప్రతి పంచాయతీ నుంచి సేకరించిన మట్టి మూటలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నుంచి కోఆర్డినేటర్ల బృందం ముందుగా బస్సులో విజయవాడ చేరుకుంటారని, అక్కడి నుంచి రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల ప్రతినిధుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలులో ఢిల్లీకి వెళ్తారని తెలియజేశారు. దేశం కోసం అసువులు బాసిన స్వాతంత్ర్య సమరయోధుల జ్ఞాపకార్థంగా ఢిల్లీలో ప్రత్యేక ఉద్యానవన నిర్మానానికి ఈ మట్టిని వినియోగించనున్నారని వివరించారు. కార్యక్రమాన్ని నిర్వహించిన నెహ్రూ యువకేంద్ర ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్, నెహ్రూ యువకేంద్ర కోఆర్డినేటర్ ఉజ్వల్, సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, ఎన్‌వైకె అకౌంటెంట్ డబ్బీరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఓటర్ల సంఖ్య 18,27,143

- ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల
- మార్పులు, చేర్పులకు డిసెంబర్ 9 వరకూ అవకాశం



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికల కోసం రూపొందించిన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో 18,27,143 మంది ఓటర్లున్నారని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. ఓటర్ల ముసాయిదా జాబితాను ఆయన శుక్రవారం విడుదల చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. డిసెంబర్ 9వ తేదీ వరకూ ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు నేటి నుంచి మొత్తం 45 రోజుల పాటు అవకాశం కల్పిస్తున్నామన్నారు. అన్ని వర్గాలు సహకరించాలని ఆయన కోరారు. ఫిర్యాదుల కోసం నవంబర్ 4,5 అలాగే డిసెంబర్ 2, 3వ తేదీల్లో ఆయా పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవెల్ అధికారులతో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 12వ తేదీ వరకూ వచ్చిన ఫిర్యాదుల పరిశీలన పూర్తి చేసి, డిసెంబర్ 26వ తేదీ నాటికి వాటిని పరిష్కరించి జనవరి 1వ తేదీ నుంచి చివరి దశ పరిశీలన పూర్తయిన అనంతరం చివరిగా ఎలక్టోరల్ పబ్లికేషన్‌ను వచ్చే ఏడాది జనవరి 5వ తేదీన నిర్వహిస్తామని పేర్కొన్నారు. పలు అభ్యర్థనల మేరకు చనిపోయిన ఓట్ల తొలగింపు, స్థానికంగా నివాసం లేకపోవడం తదితర క్లెయిమ్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఈ సారి 96వేల మంది ఓట్లను తొలగించినట్లు పేర్కొన్నారు.

మొత్తంగా ఓటర్లలో 9,08,440 మంది పురుషులు, 9,18,528 మహిళలు ఉన్నారని, వీరి కోసం 2357 పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. ప్రతి 1000 మంది జనాభాలో 758 మంది ఓటర్లున్నారని, సర్వీసు ఓటర్ల సంఖ్య 16,162గా ఉందని చెప్పారు. డిఫెన్సు, ఇతర కేంద్ర సర్వీసుల్లో ఉన్న సర్వీసు ఓటర్లు ఎక్కువగా ఉన్న జిల్లాగా శ్రీకాకుళం రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలిచిందన్నారు. జిల్లాలో 18-19 ఏళ్ల మధ్య ఉన్న వారు 50వేల మంది వరకు ఉన్నట్లు అంచనా వేశామని, అయితే 20వేల మంది మాత్రమే ఓటు కోసం నమోదు చేసుకున్నారని, దీనిపై ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తామన్నారు. అర్హత ఉన్న వారంతా ఓటు హక్కు పొందేలా చూస్తామని తెలిపారు. అన్ని వర్గాలు అధికారులతో సహకరించాలని కోరారు.

ఓటు హక్కు తెలుసుకునేదెలా



ఓటర్లు తమకు ఓటు హక్కు ఉన్నదీ లేనిది తెలుసుకునేందుకు బూత్ లెవల్ ఏజెంట్లను సంప్రదించాలన్నారు. ఈసిఐ వెబ్‌సైట్ డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.ఓటర్స్.ఈసిఐ.జీఓవీ. ఇన్ ద్వారా కూడా సమాచారాన్ని తెలుసుకోవచ్చని, లేదా ఓటర్ హెల్ప్ లైన్ (విహెచ్ఎ) అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఓటు వివరాలను తెలుసుకోవచ్చన్నారు. అలాగే టోల్ ఫ్రీ నంబరు 1950 ద్వారా కూడా సమాచారం తెలుసుకోవచ్చన్నారు. ఒకవేళ పేరు లేకపోయినా ఫారం-6ను సమర్పించడం ద్వారా ఓటు హక్కును పొందవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్, డిఆర్వో ఎం. గణపతిరావు ఉన్నారు.

క్లుప్తంగా

అట్టాడకు కలెక్టర్ అభినందనలు



అట్టాడ అప్పలనాయుడుని సన్మానిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్ జీవితకాల సాఫల్య పురస్కారానికి ఎంపికైన ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడును కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ శుక్రవారం తన కార్యాలయంలో అభినందించి దుశ్శాలువతో సత్కరించారు. అప్పలనాయుడు రచనల్లో జన జీవితం కనిపిస్తుందని, వైఎస్సార్ జీవితసాఫల్య పురస్కారం అప్పలనాయుడికి రావడం జిల్లాకు గర్వకారణమని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు ఆంగ్లంలోకి అనువాదమైన తెలుగు బెస్ట్ స్టోరీస్ సంకలనాన్ని కలెక్టర్‌కు బహూకరించారు. కార్యక్రమంలో కథానిలయం కార్యదర్శి దాసరి రామచంద్రరావు, న్యాయవాది మామిడి క్రాంతి, జానపద వైద్యులు బి.సత్యకర్మ తదితరులు ఉన్నారు.

కాలేజీకి రూ.లక్ష వితరణ



రూ.లక్ష చెక్కును ప్రిన్సిపాల్ దామోదర్‌రావుకి అందజేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వపు విద్యార్థులు కళాశాల ప్రగతి కోసం ప్రిన్సిపాల్ గురుగుబెల్లి దామోదర్‌రావుకి రూ.లక్ష శుక్రవారం వితరణగా అందజేశారు. 1965–1968 బ్యాచ్ సివిల్ ఇంజినీరింగ్ పూర్వపు విద్యార్థులు క్లాస్ రూముల్లో డ్యూయల్ డెస్క్ ఫర్నీచర్ కోసం ఈ సాయాన్ని అందజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పూర్వపు విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామిక వేత్తల సహకారంతో కళాశాల అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. పూర్వ విద్యార్థులు సూర్యారావు, తవిటి రాజు, ప్రసాదరావు, కృష్ణమూర్తి, రామా రావులు పాల్గొన్నారు. వీరికి కళాశాల అధ్యాపకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

'బాలల సైన్స్ కాంగ్రెస్‌ను విజయవంతం చేయండి'



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం రూరల్: జిల్లా డివిజన్ స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్‌ను విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. మండల పరిధిలోని గురజాడ విద్యాసంస్థల్లో శుక్రవారం నిర్వహించిన ఒక రోజు బాలల సైన్సు కాంగ్రెస్ సెమినార్ కార్యక్రమంలో వారు మాట్లాడారు. మన ప్రాంతంలో ఉండే అనేక సమస్యలను పరిష్కరించే దిశగా సైన్స్ ప్రాజెక్టులో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ప్రస్తుతం పర్యావరణ వ్యవస్థలో ఉన్న అనేక సమస్యలను పరిష్కరించే దిశగా సైన్సు ఉపాధ్యాయులు ప్రాజెక్టులకు రూపకల్పన చేయాలన్నారు. ప్రాజెక్టు రూపకల్పన ఎలా చేయాలన్న విషయాన్ని ఆప్కాస్ట్ జిల్లా సమన్వయకర్త ఎస్.కుమార స్వామి వివరించారు.

చెరకు 'మద్దతు' రూ.3080

రేగిడి: మండలంలోని సంకిలి వద్ద ఉన్న ఈఐడీ ప్యారీస్ చక్కెర కర్మాగారం రైతులకు తీపికబురు అందించింది. ఈ ఏడాది చెరకు టన్నుకు రూ.3080 మద్దతుధర చెల్లిస్తున్నట్లు యాజమాన్యం ప్రతినిధులు వెల్లడించారు. గతేడాది కంటే టన్నుకు రూ.100 పెంచామన్నారు. ఈనెల 30 నుంచి రైతుల దగ్గర తీసుకొచ్చిన చెరకును క్రషింగ్ చేస్తామని వివరించారు. ఈ మేరకు కంపెనీ ప్రతినిధులు శుక్రవారం కర్మాగారం వద్ద మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా కర్మాగారం సీనియర్ అసోసియేటివ్ వైస్ ప్రెసిడెంట్ పట్టాభి రామిరెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది 4.10 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ లక్ష్యం చేసుకున్నామని తెలిపారు. గతేడాది 4.77 లక్షల మెట్రిక్ టన్నులు చెరకు క్రషింగ్ చేసినట్లు వెల్లడించారు. 2023–24 ఏడాదికి సంబంధించి అక్టోబర్–2023 నుంచి సెప్టెంబర్ 2024 మధ్య చెరకును ఎకరాలో మొక్కదూరపు సాళ్ల పద్ధతిలో నాలుగు అడుగుల మధ్య నాటితే రూ.12 వేల రాయితీ ఇవ్వనున్నట్లు చెప్పారు. మమ్ము సాగు చేసే రైతులకు ఎకరాకు రూ. 2500 రాయితీ ఇస్తున్నామన్నారు. మొక్క రాయితీ పొందేందుకు రైతులకు విడిగా ఒక ఎకరం నుంచి 30 టన్నుల చెరకు సరఫరా చేయాల్సి ఉందని వివరించారు. 25 టన్నుల వరకూ సరఫరా చేస్తే దామాషా పద్ధతిలో రాయితీ ఇస్తున్నామని, 25 టన్నుల కంటే సరఫరా, ఉత్పత్తి తగ్గితే రాయితీ వర్తించదని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో కేన్ డీజీఎం జె.రాజేంద్ర, మేనేజర్ వి.మురళీకృష్ణ, హెచ్ఆర్ పి.శ్యామ్‌కుమార్, ఏజీఎం ఫైనాన్స్ తదితరులు పాల్గొన్నారు.

రైతన్న నేస్తాలకు.. ఆపన్న హస్తాలు



కొత్తూరులోని ల్యాబ్‌లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్న దృశ్యం

- పశువ్యాధి నిర్ధారణకు ల్యాబొరేటరీల ఏర్పాటు
- ఒక్కో కేంద్రంలో 73 రకాల పరీక్షలు
- జిల్లాలో 8 ల్యాబ్‌లతో సేవలు

కొత్తూరు: రైతన్న నేస్తాలకు ప్రభుత్వం ఆపన్న హస్తం అందిస్తోంది. ఆపదలో ఉన్న పశువులకు అత్యవసర వైద్యం చేయించడానికి స్థానికంగానే సకల సదుపాయాలు కల్పిస్తోంది. అందులో భాగంగా జిల్లాలోని ఎనిమిది నియోజకర్గాల్లో నియోజకవర్గ స్థాయి పశు వ్యాధి నిర్ధారణ ల్యాబరేటరీలను ఏర్పాటు చేశారు. దీంతో పాటు శ్రీకాకుళంలో బహుళార్థక ల్యాబొరేటరీ(ఏడీడీఎల్)ను ఏర్పాటు చేశారు. ఈ ల్యాబొరేటరీల్లో పశువైద్యంలో డిప్లమా పూర్తి చేసిన వారిని ల్యాబ్ టెక్నీషియన్‌గా నియమించారు. వీరు పశువుల పేడ, రక్తం, మూత్రం, పాలు, శీరం, హెచ్‌బి, పీహెచ్ వంటి పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తారు.

పక్కాగా వ్యాధి నిర్ధారణ

నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో స్థానికంగా ఉండే పశువులకు వచ్చిన వ్యాధులను నిర్ధారించేందుకు శ్యాంపిళ్లను ఆయా మండల పశు వైద్యాధికారులు సేకరిస్తారు. వీటిని పరీక్షించిన తర్వాత ఫలితాల ఆధారంగా చికిత్స చేస్తారు. గతంలో అయితే ఇలా వ్యాధి నిర్ధారణ పక్కాగా జరిగేది కాదు. ఫలితంగా వందలాది పశువులు ప్రాణాలు కోల్పోయాయి. ఇప్పుడు ల్యాబ్‌ల ద్వారా వ్యాధి నిర్ధారణ జరుగుతుండడంతో మంచి మందులు అందిస్తూ పశువుల ప్రాణాలు కాపాడుతున్నారు. జిల్లాలో ఇంత వరకు ఈ ల్యాబ్‌ల ద్వారా 2021 మే నుంచి 2022 మార్చి వరకు 928 పశుశులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు 4589 పశువులకు పరీక్షలు నిర్వహించారు. 2023 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ వరకు 1434 పశువులకు పరీక్షలు నిర్వహించారు. మొత్తంగా 6951 పశువులకు పలు రకాల పరీక్షలు నిర్వహించి ప్రాణాలు కాపాడారు. దాదాపు ఐదు వేల మంది రైతులు లబ్ధి పొందారు. ఇప్పటికే జగనన్న సంచార పశువైద్య వాహనాలతో రైతులకు మేలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ ల్యాబ్‌ల ద్వారా ఇంకా మేలు జరుగుతోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కొత్తూరులోని నియోజకవర్గ స్థాయి పశువ్యాధి నిర్ధారణ ల్యాబొరేటరీ

నాణ్యమైన వైద్యం



నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన ల్యాబ్‌ల ద్వారా వ్యాధి నిర్ధారణ చేసి నాణ్యమైన వైద్యం అందిస్తున్నారు. వీటిని పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. రైతులు వీటిని చక్కగా ఉపయోగించుకుంటున్నారు.

– ఎం.కిశోర్, పశు సంవర్ధక శాఖ జేడీ

ఎంతో ఉపయోగకరం



నియోజవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన పశు వ్యాధి నిర్ధారణ కేంద్రాల వల్ల మూగజీవాలకు చక్కటి వైద్య అందుతోంది. ఇవి ఎంతో ఉపయోగకరం. ఇలాంటి ల్యాబ్‌లు పశువుల ప్రాణాలు కాపాడుతున్నాయి.

– జి.నారాయణరావు, ఏడీ, కొత్తూరు సామాజిక పశువైద్య శాల

అత్త మృతదేహానికి కోడలు తలకొరివి

టెక్కలి రూరల్: అత్త మృతదేహానికి కోడలు తలకొరివి పెట్టిన ఘటన మండలంలోని బొరిగిపేట గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. బొరిగిపేట గ్రామానికి చెందిన దివ్వల చిలకమ్మ(70) అనే వృద్ధురాలు గురువారం గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఆమె కుమారుడు పన్నెండేళ్ల కిందట ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. తలకొరివి పెట్టేందుకు ఎవరూ లేకపోవడంతో కోడలు దివ్వల కృష్ణవేణి తన అత్తకు తలకొరివి పెట్టింది.



అత్త మృతదేహానికి తలకొరివి పెడుతున్న కోడలు

రైలు నుంచి జారిపడిన యువకుడు

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్‌లో గుణుపూర్ నుంచి భువనేశ్వర్ వెళ్తున్న రాజారాణి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కే ప్రయత్నంలో ఓ యువకుడు జారిపడి గాయాలపాలయ్యాడు. వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరి పంచాయతీ వెంకటాపురం గ్రామానికి చెందిన మరడ పాపారావు అనే యువకుడు భువనేశ్వర్ చేరుకునేందుకు స్టేషన్‌కు వచ్చాడు. ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంలో ఉన్న రాజారాణి ఎక్స్‌ప్రెస్ బయల్దేరిపోవడంతో రైలు ఎక్కే ప్రయత్నంలో జారిపడిపోయాడు. అక్కడున్న వారు రక్షించి 108 అంబులెన్సుకు సమాచారం అందించడంతో పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



పాపారావుకు ప్రథమ చికిత్స అందిస్తున్న 108 సిబ్బంది

వ్యాసరచన పోటీల్లో సొండిపూడి విద్యార్థుల ప్రతిభ

మందస: పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేర్నెస్ అనే అంశంపై శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో సొండిపూడి హైస్కూల్ విద్యార్థులు సాయిగౌతమి పాణిగ్రాహి, బాడ శ్రీకాంత్, వై.ఢిల్లీరావు, బాడ శ్రీజ ప్రతిభ చూపి, ప్రథమ, ద్వితీయ, కన్సోలేషన్ బహుమతులు సాధించారు.

విజేతలకు డీజీఎం ఎం.రామచంద్ర న్, విశెట్టి, మేనేజర్ కె.రఘుపతి బహుమతులు అందజేశారు. వీరిని హెచ్‌ఎం బి.సుందరసాల్మన్, ఉపాధ్యాయులు ఎస్.అప్పారావు, నగిరి కరుణాకర్, ఎస్.నారాయణరావు, చంద్రశేఖర్, కె.వెంకటరమణ, ఆర్.చంటిబాబు, వై.తులసీదాసు అభినందించారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ప్రతినిధులు

'వరిలో దోమ ఉధృతి కట్టడి చేయాలి'



మడపాం వద్ద వరి పొలాలను రైతులతో కలిసి పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నరసన్నపేట: మండలంలో స్వర్ణ, సాంబ, ఇతర ప్రైవేటు రకాల వరి పైర్లపై దోమ ఉధృతి కనిపిస్తోందని, రైతులు వెంటనే దాన్ని కట్టడి చేయాలని శాస్త్రవేత్తలు భాగ్యలక్ష్మి, పి.ఉదయ బాబులు అన్నారు. మండలంలో శుక్రవారం స్థానిక వ్యవసాయాధికారి కె.సునీతతో కలసి సత్యవరం, మడపాం తదితర గ్రామాల్లో పర్యటించి వరి పైర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ దోమ ఉధృతిని బట్టి రైతులు పైమెట్రోజెన్ 50 డబ్ల్యూజీ 0.6 గ్రాములు లేదా ట్రై ఫ్లూమిజోపైరిమ్ 19 ఎస్‌జీ 0.48 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే వరి అనంతరం అపరాల సాగులో రైతులు మెలకువలు పాటించాలని విత్తనాలు ఎంపికపై దృష్టి పెట్టాలని రైతులను కోరారు. మినుగులో ఎల్బీజీ 752, ఎల్బీజీ 787,టీజీబీ 104,జీబీజీ–1 పెసరలో ఎల్‌జీజీ 460,టీఎం 96–2,ఐపీఎం 2–14 వంటి రకాలు అనుకూలమైనవని అన్నారు.

గడ్డి మందు తాగి యువకుడు మృతి

బూర్జ : మండలంలో గల చీడివలస గ్రామానికి చెందిన పోలాకి వెంకటేష్ (19) గడ్డి మందు సేవించి రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో శుక్రవారం ఉదయం మృతి చెందాడు. గ్రామస్తులు, స్థానిక పోలీసులు తెలియజేసిన వివరాలు ప్రకారం.. వెంకటేష్ కడుపు నొప్పి తాళలేక గురువారం గడ్డి మందు తాగేశాడు. కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే మన్యం జిల్లా పాలకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి రాగోలు జెమ్స్‌కు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వెంకటేష్‌తో పాటు అన్నయ్య రామ్మోహన్ గ్రామంలో గల అమ్మమ్మ ధర్మవరపు సన్యాసమ్మ వద్ద ఉంటున్నారు. రామ్మోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ సి.సూర్యనారాయణ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.



పోలాకి వెంకటేష్ (ఫైల్)

'పిల్లలకు మత్తు ఔషధాలు విక్రయిస్తే చర్యలు'



మాట్లాడుతున్న సీతారాం

శ్రీకాకుళం అర్బన్: వైద్యుల సిఫారసు లేకుండా పిల్లలకు ఎలాంటి మత్తు ఔషధాలను విక్రయించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎస్‌సీపీసీఆర్) సభ్యులు గొండు సీతారాం అన్నారు. కమిషన్ ఆదేశాల మేరకు శుక్రవారం శ్రీకాకుళంలోని డ్లగ్స్ స్కూల్ దగ్గరలో గల జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయంలో మత్తు ఔషధాల విక్రయంపై దుకాణదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ పెద్దలు తోడు లేకుండా, పిల్లలు నేరుగా వైద్యుల సిఫారసు చీటీలు లేకుండా మందుల దుకాణాలకు వస్తే కోరెక్స్ వంటి దగ్గుమందులు ఆల్ప్రాజోలం 0.25,0.5 ఎం.జి, బెంజోడియ జెపినిస్, డయాజెపం, నైట్రాజెపం,ఆట్రివ్స్ 0.25,రెస్టిల్ 0.5వంటి మందులే కాకుండా ఒపియోయిడ్స్, మోర్ఫైన్, కోడైన్, ఇంటాలైనేటిక్ వంటి మత్తు ఇంజెక్షన్లు ఎట్టి పరిస్థితుల్లో విక్రయించకూడదని తెలిపారు. పిల్లలకు ఇలాంటి మందులు విక్రయాలు జరపబోమని ఆయా షాపులు యజమానులు స్పష్టంగా బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు ఉల్లంఘించి బాలలకు మత్తు ఔషధాలు అమ్మకాలు జరుపుతున్నట్టు పౌర సమాజం దృష్టికొస్తే ఏపీఎస్‌సీపీసీఆర్2018@-gmail.com నకు ఫిర్యాదులు చేస్తే తక్షణమే స్పందించి చట్ట ప్రకార చర్యలతో పాటు క్రిమినల్ చర్యలకు సిఫారసు చేస్తామని అన్నారు.

జిల్లా ఔషధ నియంత్రణ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.చంద్రరావు మాట్లాడుతూ బాలలకు మత్తు ఔషధాలు అమ్మకాలు జరపబోమని ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయిస్తామని అన్నారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు, సూచనలు వంద శాతం పాటించి ఆరోగ్యవంతమైన బాలల శ్రీకాకుళం జిల్లాగా తీర్చిదిద్దే ప్రయత్నాలు చేస్తామని అన్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి వెంకటరమణ మాట్లాడుతూ మత్తు ఔషధాలు వాడడం వల్ల పిల్లల జీవితాలు ఏ విధంగా ఛిద్రం కాబోతాయో ఎలిమెంటరీ విద్య నుంచే పిల్లల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు.

కార్యక్రమంలో జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.యుగంధర్‌రావు, శ్రీకాకుళం జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు గన్నెప్పడు, జిల్లా డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ అధ్యక్షులు కె.కరుణ కుమార్ గుప్త, గౌరవ ప్రధాన కార్యదర్శి వి.మణి రాజు, ట్రెజరర్ కె.మురళీకృష్ణ, నగరానికి చెందిన ఔషధ దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

సచివాలయాలకు సోలార్ విద్యుత్ ప్యానెల్స్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని పది సచివాలయాలకు యూనియన్ బ్యాంక్ తరపున సోలార్ విద్యుత్ ప్యానెళ్లు అందించారు. యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ ఎంవీ తిలక్ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా సంబంధిత నిధులను శుక్రవారం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌కు ఆయన చాంబర్‌లో అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎం.సూర్య కిరణ్, యూనియన్ బ్యాంక్ కలెక్టరేట్ బ్రాంచ్ మేనేజర్ కె. తేజేశ్వరరావు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు సోలార్ ప్యానల్‌ను నిధులు అప్పగిస్తున్న యూనియన్ బ్యాంకు అధికారులు

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



పాలవలస ఆర్‌బీకేలో వైఎస్సార్ పొలంబడిపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ జేడీ శ్రీధర్

బూర్జ: మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వ్యవసాయ శాఖ జేడీ కె.శ్రీధర్ అన్నారు. మండలంలో గల పాలవలస గ్రామ ఆర్‌బీకేలో శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు వైఎస్సార్ పొలంబడిపై ఒక్క రోజు శిక్షణ, గ్రామ సభ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ పద్ధతుల వల్ల పెట్టుబడి తక్కువ దిగుబడి ఎక్కువ, రసాయన ఎరువుల వాడకం వల్ల పెట్టుబడి ఎక్కువ దిగుబడి తక్కువ అవుతుందని అన్నారు. సేంద్రియ విధానం అలవర్చుకోవాలన్నారు. మండలంలో గల పరవాస్తు రామన్న పేట, పాలవలస, జంగాలపాడు, బొడ్లపాడు, అడ్డూరిపేట గ్రామాల్లో సాగు చేస్తున్న 55 మంది రైతులకు 14 వారాల పాటు వ్యవసాయ ఉత్పత్తులపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలియ జేశారు. ఈ రైతులను సంఘాలుగా ఏర్పాటు చేసి ఏపీ ఆర్గానిక్స్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ వారితో ఒప్పందం, ధ్రువీకరణ చేయిస్తామన్నారు. 2023 ఖరీఫ్ పంటలకు ఈకేవైసీ చేయడం పూర్తయినట్లు తెలిపారు.

మండలంలోని 16 రైతు భరోసా కేంద్రాల్లో నవంబరు 10 నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు మద్దతు ధరపై కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కొత్తూరు ఏడీఏ బి.రాజగోపాలరావు, శ్రీకాకుళం ఏడీఏ వెంకటరావు, పెద్దపేట ఆర్టీకల్చర్ రీసెర్చ్ సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త బీవీకే భగవాన్, మండల వ్యవసాయాధికారి వి.రాజేశ్వరరావు, మండల ప్రత్యేక ఆహ్వానితులు కర్నేన నాగేశ్వరరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, పలువురు అధికార్లు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

స్త్రీ నిధి.. అతివకు పెన్నిధి

- అర్హులందరికీ స్త్రీ నిధి రుణం
- గ్రామీణ పేద మహిళల్లో స్వయం ఉపాధి వెలుగులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్త్రీ నిధి రుణాలను జిల్లా మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. సులభంగా రుణాలు అందడం, తక్కువ వడ్డీ, ఎక్కువ వాయిదాల చెల్లింపులు వంటి సదుపాయాలు ఉండడంతో ఈ రుణాలు తీసుకునేందుకు మహిళలు మొగ్గు చూపుతున్నారు. ఈ స్త్రీ నిధి బ్యాంకు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటై 12 ఏళ్లవుతోంది. మహిళా సంఘాలకు సహకరిస్తూ వారి ఆదాయాన్ని వృద్ధి చేస్తూ దినదినాభివృద్ధి చెందుతోంది.

ఒకప్పుడు ఒక స్వయం శక్తి సంఘానికి రూ.2లక్షలు, ఇద్దరు ముగ్గురికి మాత్రమే అందజేసేవారు. ఇప్పుడు గరిష్టంగా ఐదుగురికి రూ.5లక్షల వరకు రుణం ఇస్తున్నారు. గ్రామ సంఘం గ్రేడింగ్ ఆధారంగా మరింత ఎక్కువ రుణాలు అందించేందుకు స్త్రీనిధి బ్యాంకు ముందుకు వస్తోంది. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ బ్యాంకు కేవలం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళా స్వయం శక్తి సంఘాల సభ్యులకు మాత్రమే రుణాలు ఇస్తుంది.

రాష్ట్రంలో ప్రథమం

స్త్రీనిధి రుణాలు వాటిని వాయిదా పద్ధతిలో చెల్లించే విషయంలో శ్రీకాకుళం జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉంది. ఈ బ్యాంకు వ్యవహారాలు శత శాతం ఫలితాలు ఇవ్వడంతో మహిళలు రుణాలు తీసుకునేందుకు ఆసక్తిని చూపుతున్నారు. కేవలం 11 శాతం వడ్డీతో రుణాలను వాయిదాల పద్ధతిలో చెల్లించే విధంగా రుణాలు అందిస్తున్నారు.

రుణాల మంజూరు ఇలా..

మహిళా స్వయం శక్తి సంఘంలో ఉన్న ఒక వ్యక్తికి గరిష్టంగా రూ.లక్ష రుణం ఇస్తారు. ఆ గ్రూపులో రూ.5 లక్షలు వరకు అందజేస్తారు. దురదృష్టవశాత్తు స్త్రీ నిధి రుణం పొందిన సభ్యులు మరణిస్తే అక్కడ నుంచి ఉన్న రుణం చెల్లించాల్సిన అవసరం లేదు. రుణం తీసుకున్న ప్రతి మహిళకు బీమా చేస్తారు. రూ.50 వేలు తీసుకున్న వారు గరిష్టంగా 24 వాయిదాల్లో చెల్లించాలి, రూ.50,001 నుంచి రూ. లక్ష వరకు రుణం తీసుకున్న వారికి గరిష్టంగా 36 వాయిదాలు వరకు తిరిగి చెల్లించేందుకు అవకాశం ఇస్తారు. రుణ చెల్లింపులు అకౌంట్, పేటీఎం, ఫోన్ పే, రూపే కార్డు, డెబిట్ కార్డు ద్వారా చెల్లించే పద్ధతి ఉంది. ఏ గ్రేడ్ లో ఉన్న గ్రామ సంఘానికి రూ. 75 లక్షలు, బి గ్రేడ్‌కు రూ.65 లక్షలు, సి గ్రేడ్‌కు రూ.55 లక్షలు, డి గ్రేడ్‌కు రూ. 45 లక్షల వరకు రుణం అందజేస్తారు.



అధిక వడ్డీల నుంచి విముక్తి

స్త్రీనిధి అప్పు తీసుకొని ఇత్తడి వ్యాపారం చేస్తున్నాను. గతంలో మేము భార్యా భర్తలం కూలి పనికి వెళ్లేవాళ్లం. అప్పట్లో ప్రైవేటుగా అప్పులు తీసుకుని అధిక వడ్డీల వల్ల ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం వడ్డీల బాధ లేకుండా స్త్రీ నిధి రుణాలు ఆదుకుంటున్నాయి. బ్యాంకు నుంచి ఏడు సార్లు కలిపి రూ.2,50,000, స్త్రీనిధి నుంచి రూ.50,000 రుణాలుగా తీసుకున్నాం. క్రమం తప్పకుండా రుణం తిరిగి చెల్లించి, వడ్డీ రాయితీ పొందుతున్నాం.

– డబ్బీరు కవిత, సారవకోట మండలం బుడితి.

వ్యాపారం వృద్ధిచేశాం



గతంలో నాకు చిన్న దుకాణం ఉండేది. పెట్టుబడి లేనందున అన్ని రకాల సరుకులు అమ్మలేకపోయేదాన్ని. నాకు స్త్రీనిధి నుంచి రూ.లక్ష అప్పు రావడంతో నా షాపు సరుకులతో కళకళలాడుతోంది. వ్యాపారం కూడా గతం కంటే ఎక్కువగా అవుతోంది. ఇదంతా ఈ పథకం ప్రోత్సాహం చలవే.

– మాడుగుల సూర్యకళ, లావేరు మండలం, మురపాక.

మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి



మహిళా సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో పథకాలు అందిస్తోంది. మహిళా సంఘాలకు కూడా రుణాలు తక్కువ వడ్డీకి అందజేసి, వారికి ఆర్థిక స్వావలంబన కల్పిస్తోంది. ఈ క్రమంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో స్త్రీనిధి బ్యాంకు మహిళా సంఘాల్లోని పేద మహిళలకు రుణాలు ఇచ్చి ఆదుకుంటోంది. కొన్నేళ్లుగా మంచి ప్రగతి వచ్చింది.

– డాక్టర్ డీవీ విద్యాసాగర్, డీఆర్‌డీఏ పీడీ, శ్రీకాకుళం

రాష్ట్రంలో ప్రథమంలో ఉన్నాం



స్త్రీనిధి రుణాల మంజూరు, చెల్లింపులు, తిరిగి చెల్లింపుల విషయంలో మన జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. మహిళలు ఎంతో ఆసక్తితో రుణం తీసుకొని, తిరిగి చెల్లిస్తున్నారు. 12 ఏళ్లుగా ఈ సంస్థ ఎంతో ప్రగతి సాధించి, ఎంతోమంది మహిళకు ఆర్థికంగా చేదోడుగా నిలిచింది. రుణం మొత్తం ఈ ఏడాది నుంచి పెంచడం జరిగింది. దీంతో ఒక వ్యక్తికి ఒక రూ.లక్ష వరకు రుణం వస్తుంది.

– వి.సత్యనారాయణ, ఏజీఎం, స్త్రీనిధి, శ్రీకాకుళం